# ఆశయభంగం

[చిన్న కథ]

[అర్థంకష్టమైన ఆదర్శంతో బయలుదేరి పాతాళాని కంటా పడిపోయిన వారిలో ఈ కథలోని మోహనపాత్ర ఒకటి. ఇట్టి పాత్రలు ఒక్క సినీమారంగములోనే కాకుండా అన్ని రంగాల్లోనూ వుంటారు. కాబట్టే ఇట్టి పాత్రలు లోకసహజమైనవని చెప్పడం —సంపాదకుడు ]

రచయిత:

## పి. వి. సుబ్బారావు

౧

'మోహనా! నే నెందుకు చెపుతున్నానో విను.'

'నేను ఎవరు ఏమి చెప్పినా వింటాను.'

'ఈ చెవిని విని ఆ చెవిని విడిస్తే ఏమిలాభం?'

'లాభనష్టాల కిదేమైనా వ్యాపారమా? నీవు చెప్పవలసినది చెప్పితే నేను చెయ్యవలసినది చేస్తాను'

'నీవు అలా అంటావని నాకు తెలుసు. అయినా, స్నేహితుణ్ణి గనక హృదయపూర్వకంగా చెపుతున్నాను. నామాట విని తప్పకుండా ఆచరణలో బెట్టమని నా ప్రార్థన.'

'చెప్పవలసినది చెప్పు, ప్రార్థించ నక్కరలేదు! కొబ్బరికాయ కొట్టనక్కరలేదు'

'నీవు పెండ్లి చేసుకొని ఒక యింటివాడివైతే చూద్దామని వుంది.'

'ఈబుద్ధి నీకే పుట్టిందా ? లేక ఎవరైనా చెప్పారా?'

'ఈమాత్రపు టాలోచన నీ హితంకోరే ప్రతీవాడికీ తడుతుంది. పెళ్ళీ పేరంటం జేసుకోవటము, పిల్లా మేకాతో లక్షణంగా కాపురం దిద్దుకోవటం ప్రతి మానవుడికి సామాన్యమైన విషయమే! ఇది నీకు వింతగా కనుపిస్తుంది!'

'సామాన్యంగా బ్రతకటానికి నాకిష్టములేదు. దేశముకోసమో, కళకోసమో నాశక్తిసామర్థ్యాలు వినియోగించటము నాసంకల్పం'

'నీ ఊహ బాగానే వుందిగాని పెండ్లిజేసుకొని ఆపని సాగించటానికి ఏమిలోటుంది? భార్యా పుత్రులుకూడా నీకు తోడ్పడతారు గాదూ?'

'కౌపీన రక్షణార్థం సంసారము తయారై మహాఋషి తపస్సు తగులబడినట్లవుతుంది. భార్యాపుత్రులు నాకు సహాయపడతారని ఎవరు చెప్పగలరు? వారు నాకుఎదురు తిరగకూడదూ? భార్యాభర్తలకు భేదాభిప్రాయాలుండి ఎన్ని సంసారాలు తగులబడలేదు'

'సంసారము అవసరమన్న సంగతి మర్చిపోతున్నావు'

'కల్పించుకొంటే అన్నీ అవసరములే! ఏఅవసరమూ లేకుండా స్వతంత్రంగా జీవించాలనే నా ఆశ. నా ఒకడికోసమే యింత ఆరాటపడుతుంటే మరికొందరిని నెత్తిమీ దెక్కించుకోవటము ఎలాగ?'

'నీవు మొయ్యవలసిన బరువేముంది? చెమటూడ్చి పెద్దలు సంపాదించిన ఆస్తి కర్చుబెట్టుకుంటూ హాయిగా వుండక-'

'నీవు నూరు చెప్పు, వెయ్యి చెప్పు. నాయిష్టప్రకారము నేను చెయ్యవలసినదే! నాబుద్ధి నాకు సుఖము నిస్తుంది. పరబుద్ధి వినాశకరం'

'ఎవరైనా కొంత స్వార్థపరులుగా వుండాలి. తనకు మాలిన ధర్మం పనికిరాదు. పైగా, కుందేటివలె ఒకరు వేసినకంప దాటను- ఒకరు ముట్టినసీరు త్రాగను అనటమా? ఎప్పటికైనా నీ దుర్గతి కిదే

కారణమౌతుంది.' అంటూ రాముడు వెళ్ళిపోయాడు.

## ౨

మోహనుకు భూమిమీద పడ్డాక కాలశకటం పరిణామదేవత చేతుల్లో 25 సంవత్సరాలుసాగింది.

చిన్ననాడే తల్లి గతించింది అందువల్ల తండ్రి చేతుల్లో అల్లారుముద్దుగా ఆకుల్లో పిందెలాగ గుమ్మనగా పెరిగాడు. గారాబము ఎక్కువవటమువల్ల విశేషము సరస్వతీకటాక్షము కలుగలేదు. రెండు సంవత్సరములక్రింద తండ్రి కూడా గతించటమువల్ల వున్నఆస్తి అతని చేతుల్లో పడటము– వెనుక 'ఆం' అనేవారు లేకపోటము సంభవించింది. స్వయం రాజా, స్వయం మంత్రి, నాస్తి శత్రుభయమన్నట్లుంది. ఈ విధంగా ప్రారంభమైంది అతని జీవయాత్ర.

వేరేపని లేకపోవటమువల్ల, చేతుల్లో నాలుగుడబ్బులు ఆడుతుంటమువల్ల తరుచు సినిమాలకు వెళ్ళటము అలవాటైంది. అప్పుడప్పుడు సినిమా పేజకోసము పేపరు చూడటము, సినిమా టెక్నిక్ పుస్తకములు చదవటము ప్రారంభించాడు. అతను చుట్టుచేరిన కుఱ్ఱవాళ్ళతో చిట్టమ్మ (పుష్పవల్లి) పేరుప్రతిష్టల్లోకి వస్తుందనీ, చినమస్తాను (శ్రీరంజని) విచారము వొప్పించి జనులను రంజింపజేయగలదని, కనాంబాల (కనాందేవి) ప్లేటు సింగరులో బాగాపాడిందని, షరీపా (ఇల్లాదేవి) రంజితువారి 'కాట్' లో బాగా యాక్టుచేసిందని యింకా ఎన్నో విషయాలు చెప్పుండేవాడు. శాంతాయాప్టే గానం అతని చెవుల్లో నాదం జేస్తుండేది. చంద్రమోహన్ నడక, ముంతాజాలీ డాన్సు, బారువా, సుబ్బారావు గార్ల యాక్టింగు నిద్రలోగూడ అతని మనోపథాన్నుంచి తొలగేవి కాదు.

చిన్నతనంలో చదువుసంధ్యలు లేని కాలం ఎంత దుర్వినియోగంజేసినా యిప్పుడైనా సినిమా ప్రపంచములో దూకి కళను పెంపొందించాలనే ఆశయం బయలుదేరింది. కళను వృద్ధిపరచే పురుషుల్లో తానొకడవవలె ననుకున్నాడు ఎంతమంచి ముత్యమైనా సముద్రపు టడుగునపడితే జనులు లెక్కచెయ్యరనుకున్నాడు. శాంతారాముకు వలెనో, బారువాకువలెనో పేరుమోగిన డైరక్టరు కావలెనన్న ఆశయం బయలుదేరింది.

రంగములో దిగట మెలాగ? అతను యాక్టుచేయలేడు. చిన్నప్పుడతని కవకాశం కలుగలేదు. ఇప్పుడు నేర్చుకోవచ్చునంటే— మంచి నటులనే తమ బుద్ధిమాంద్యమువల్ల ఏమీ రానివారిలాగ తయారుజేసే డైరక్టరు— అతని కెవరు నేర్పుతారు? అతనికి మాత్రం తనకున్న శ్రద్ధనుబట్టి ఏపనిలో ప్రవేశించినా కృతార్థుడను కాగలనన్న ధైర్యముంది. అతని సంగతి తెలిసిన కొందరు 'మద్రాసువెళ్ళి, ఏస్టూడియోదగ్గరో మకాముపెట్టి అక్కడవున్న టెక్నీషియన్లతో స్నేహముచేస్తే, వారే నేర్పుతారు ఏపనైనా' అన్నారు. 'సరే' నని మోహనరావు మద్రాసు ప్రయాణం కట్టాడు.

## 3

మద్రాసులో ఒక స్టూడియో సమీపమున ఒకయిల్లు అద్దెకు తీసుకున్నాడు. క్రమంగా అక్కడ


# కథల పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| కారుణ్యం —కొడవటిగంటి కుటుంబరావు | 0 | 4 | 0 |
| రూమ్ టు లెట్ —పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి | 0 | 4 | 0 |
| స్వగతం —కొడవటిగంటి కుటుంబరావు | 0 | 4 | 0 |
| కలికి —బొడ్డు బాపిరాజు | 0 | 4 | 0 |
| బాహ్మణీకం —గుడిపాటి వెంకటచలం | 0 | 4 | 0 |
| యువ కథావళి —వివిధ రచయితలు | 0 | 4 | 0 |
| ఇల్లరికం —కొడవటిగంటి కుటుంబరావు | 0 | 4 | 0 |
| పాంచజన్యం —చక్రపాణి | 0 | 6 | 0 |
| బడదీదీ —చక్రపాణి | 0 | 4 | 0 |
| త్రిలోచన కవిరాజు —చక్రపాణి | 0 | 6 | 0 |

ఆంధ్రభూమి బుక్ డిపో
వేపేరి మదరాసు.

వున్న షెక్స్పియనులతో నటీనటులతో స్నేహం కలిపాడు. ప్రతిరోజు వారితో వస్తూపోతూ వుండేవాడు. డబ్బుమాత్రము ఖర్చవుతుందిగాని అతని కేమాత్రము మేలు కలగటము లేదు ఈవిధంగా ఆసాగరములోబడి కొట్టుకుంటున్నాడు దరీ అంతూ కనపడక- అతన్ని దరిజేర్చటానికి ఏమహానుభావుడూ పూనుకోలేదు.

అందరితోపాటు రోజా అనేనటితోకూడా అతనికి స్నేహం కలిగింది. ఆమెఎంతోబాగా పాడుతుందని, నటిస్తుందని ఆమెనుజూచి చాలా సంతోషించేవాడు. ఆమెతో తరుచు మాట్లాడటము, అపుడపుడు బహుమతులు పంపటము ఆరంభించాడు. క్రమంగా ఆరోజాపువ్వు మోహనభ్రమరాన్ని విశేషంగా ఆకర్షించింది. ప్రేమ అధికమైంది. మోహనుడు ఆమెతో పెండ్లి తలపెట్టాడు. ఈవిధంగా అతడు తాను కళను పోషింపలేకపోయినా కళను పోషించేవారికి పోషకుడైనాడు.

తన పెండ్లికి రావలసినదని బంధువులకు స్నేహితులకు ఆహ్వానాలు పంపాడు. పందిట్లో అడుగు పెట్టినవారు ఎవరు లేకపోయారు. రాముడు దగ్గరనుంచి మాత్రము ఆశీర్వదిస్తూ తంతి వచ్చింది.

పెండ్లయిన క్రొత్తలో అందరి నూతనదంపతులకువలెనే వారున్నూ ఎంతో అరమరిక లేకుండా వున్నారు. తాను సినిమాస్టారును పెండ్లి జేసుకొని హిమాన్ స్ రాయి అంతవాడో, లేక ఆ మహారాజా అంతవాడో ఐనాననుకొన్నాడు.

స్టూడియోకు వెళ్ళటము రావటము- ఏహోటలునుంచో భక్ష్యాలు తెప్పించుకొని హాయిగా కాలం గడపటం జరిగేది. ప్రేమవల్ల ఆమె చెప్పినదే వేదవాక్యం క్రింద కనుపించటమువల్ల ఆమె చెప్పినట్లు నడుచుకొంటూవుండేవాడు. కాని అలా ఎంతకాలం గడుస్తుంది ?

రానురాను చేతుల్లోవున్న డబ్బు, హృదయంలోవున్న ప్రేమ సన్నగిలింది. కళంటే తనకెంత అభిమానమున్నా తాను హృదయమిచ్చిన స్త్రీ యింకొకనితో కలిసి వుండటము చూస్తే కంట్లో దుమ్ము పడినట్లుండేది. ఏచిన్నపని కావలసినా తనచేతుల్తో చేసుకోవటము, పైగా అపుడపు డామె అధికారగర్వంగా మాట్లాడటము చూస్తే మనస్సుకు బాధగలిగించేది. ముందున్న ఆశ నిరాశఐంది. తెరమీదచూచి మంచి జీవమనుకొని తీరాదగ్గరవుండి పరిశీలిస్తే మేడిపండు పొట్టవిప్పి చూచినట్లు కనిపించింది. దూరాన్నుంచి స్వర్గమనుకొన్నది కాలు బెట్టేసరికి నరకమనిపించింది. పాలను పొంగబోసుకొన్నట్లు తనయావనాన్ని వృధాజేసుకొన్న విషయం తలిస్తే మనస్సులో ఒక పెద్దగాలి




టి. సి. యెక్.

ఆభరణాలంకారపుటందాన్ని తెలుపడానికి అద్దమేల ?

మెడ చెయినులు

2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను, వన్నెలోను బంగారు చెయినుల కేమాత్రము తీసిపోవు. నలుపెక్కవు,

| పెద్ద సైజు | | చిన్న సైజు | |
| --- | --- | --- | --- |
| 1 పేట 1-కి రూ. | 7-0-0 | 1 పేట 1-కి రూ. | 5-0-0 |
| 2 పేటలు ,, | 14-0-0 | 2 పేటలు ,, | 10-0-0 |
| 3 పేటలు ,, | 21-0-0 | వి. పి. ఖర్చులు | 0-8-0 |
| 4 పేటలు ,, | 28-0-0 | | |

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన మాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్ టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్సు —గుప్తా అండ్ కో, మెయిన్ రోడ్, కాకినాడ.

దుమారం బయలుదేరేది. ఈ చింతలో—రేపులు మాపులు రాటపాకుల్లాగ తిరిగి రోజులు నిమిషాల క్రింద గడిచే కాలంపోయి రోజొక సంవత్సరముక్రింద గడుస్తుంది.

కొద్దిరోజులు గడిచాయి. కొంచెము జ్వరమొచ్చింది. మనోచింతవల్ల ప్రబలింది. వంటిమీద వడ్లగింజవేస్తే పేలాపుగింజవుతూంది. దగ్గర ప్రాక్టీసు పెట్టుకున్న డాక్టరు చీటికి మాటికి వచ్చి కంటికి రెప్పవలె కాపాడుతున్నాడు. దగ్గర 'నా' అన్నవాళ్ళెవరు లేకపోవటమువల్ల సంరక్షణ సరిగా జరగటము లేదు. భార్య దగ్గరవుంటుందంటే, 'షూటింగు ఆగిపోతుంది, అధికార్లు వీల్లేదన్నా'రని జబాబుచెప్పింది. రాముడికి వుత్తరం వ్రాయించాడు.

ఉత్తరమందిన తక్షణం రాముడు అంగలార్చుకొంటూ వచ్చాడు. నాలుగురోజులు అడుగు కదలకుండా కనిపెట్టుక వున్నాడు. జ్వరం కొంచెము తగ్గింది తిరుగుముఖం పట్టిందనుకొన్నాడు. 'మోహనా! ఇంత పట్టుదలగలవాడవు యీ స్త్రీకి లొంగిపోయావు. సినిమాగరల్సుయొక్క ప్రణయాగ్నిలో బడి ఎంతోమంది యువకులు దగ్ధమయ్యారు. అవబోతున్నారు. అవుతారు. సుందరమైన గుడిలో సుందరమైన విగ్రహముంటుందని తలచావుగాని బంగారు పూతబూసిన సమాధుల్లో పురుగులుంటాయని తలచలేదు. ఆకారమమృతతుల్యమైనా మనస్సు విషతుల్యం. వారి మనోవృత్తికి యెరవై యుండక యికనైనా నాతో రా. ఈవిషాగ్నిని నీవు భరించలేవు. నాకు సెలవైపోయింది. నేను రేపు నిన్ను తీసుక వెళ్లుదామని అనుకుంటున్నాను' అని చెప్పాడు.

చెడి స్నేహితుడింటికి వెళ్ళటానికిష్టము లేక యిక్కడేవుంటానన్నాడు మోహనరావు. మర్నాడు 'అన్నయ్యను జాగ్రత్తగా కనిపెట్టం'డని చెప్పి- 'ఆసంగతి నాకు తెలియదూ'అన్న రోజా సమాధానం విని బండెక్కాడు రాముడు.

రాముడు వెళ్ళిపోయిన తరువాత మోహనుడికి జ్వరం తిరిగి రావటం ప్రారంభించింది. మనోచింత మరీ ఎక్కువైంది. ఒకనాడు సాయంకాలము రోజా స్టుడియోనుంచి రావటముతోటే తనకు జ్వరం పూర్తిగా వచ్చిందని, కొంచెము దగ్గర వుండమని అడిగాడు. 'నాకు జ్వరంవచ్చేటట్లుంది నాకు రిక్రియేషను లేకపోతే తప్పకుండా జ్వరం వస్తుంది కాబట్టి క్షమించా'లని వెళ్ళిపోయింది రోజా.

ఆమాట వినేసరికి మోహనునకు గుండె నీరయింది. తనకు ఈ ప్రపంచకానికి యిక సంబంధము లేదనుకున్నాడు. ఉన్న సంబంధాలన్నీ యిదివరకే తెంపేసుకున్నాడు. తన ఆశయం అంతరించింది. ఇక జీవించి సుఖం లేదనుకొని రాముడికి వుత్తరము వ్రాసి లేనిశక్తి తెచ్చుకొని బీచీవైపుకు వెళ్ళిపోయాడు.

# విజ్ఞానవిషయాలు

### ఇండియావల్ల

ప్రతి బ్రిటీష్ పౌరుని రాబడిలోని ప్రతి పౌనులోను నాలుగు షిల్లింగుల వంతున ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇండియానుంచో, ఇండియావల్లనో లభ్యమౌతుంది.

.. ... ...

### పొడుగైన వంతెన

ప్రపంచంలోకి అంతటికీ పొడుగైన వంతెన స్కాట్లండులోవుంది.

... ... ...

### అంగుళం వర్షం

ఒక అంగుళంవర్షంవల్ల పడ్డ నీరు మంచుగా మారితే ఒక అడుగు చతురం గల గడ్డగా ఔతుంది.

... ... ...

### పెద్ద చెట్టు

రోడీషియాలోని విక్టోరియా జలపాతంవద్ద ఒకపెద్ద చెట్టువుంది. దాని మొదలు చుట్టుకొలత 88 అడుగులు.

... ... ...

### శనివారం సగం సెలవు

క్రైస్తవులు చిరకాలంగా శనివారాన్ని సగంసెలవుగాపాటిస్తూవున్నారు. ఆదివారంనాడు చర్చికి పోయేటందుకు తయారై సద్దుకోవడానికిగాను ఈశలవు ఆదిలో ఉద్దిష్టమైంది.

... ... ...

### సులోచనాలు

కంటి అద్దాలు పదమూడో శతాబ్దిలో ఇటలీదేశస్థుడిచేత కనుగొనబడ్డాయి.